www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!



4 లో..

ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటా



4 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 259, సోమవారం 18-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



తీరొక్క పూలతో బతుకమ్మలు

తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, అక్టోబర్ 18 :

తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగను ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి.. సంప్రదాయ పాటలు, కోలాటాలతో సందడి చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలంతా ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. రామరామ ఉయ్యాలో.. రామణేసి రామ ఉయ్యాలో..' అంటూ మహిళలు గొంతెత్తి పాటలు పాడారు. చప్పట్లు కొడుతూ కోలాటాలు ఆడారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ చిన్నారులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా సంప్రదాయ వంటకాలను తీసుకొచ్చిన మహిళలు పరస్పరం పంచుకున్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఆత్మీయత, ఐక్యతను చాటిచెప్పాయి. భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పూల పండుగను జరుపుకొని సద్దుల బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.







మధ్యప్రదేశ్‌లో శరన్నవరాత్రి వేళ ఘోర ప్రమాదం

భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు13 మంది దుర్మరణం



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 :

మధ్యప్రదేశ్‌లో శరన్నవరాత్రి వేళ ఘోర ప్రమాదం జరిగింది. గ్వాలియర్‌లోని 400 ఏండ్లనాటి ప్రసిద్ధ శీత్లామాత ఆలయం వద్ద అదుపుతప్పిన ఓ ట్రక్కు భక్తులపైకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 39 మంది గాయపడ్డారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శీత్లామాతను దర్శించుకోవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో భారీ వాహనాల రాకపోకలపై అధికారులు నిషేధం విధించారు. అయితే శనివారం రాత్రి 1.30 (ఆదివారం తెల్లవారుజామున) గంటల సమయంలో చినోర్ వైపు నుంచి వరి ధాన్యం లోడుతో వస్తున్న ట్రక్కును ట్రక్కును పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఉన్న సిబ్బంది ..మిగతా 2లో

బతుకమ్మ, దసరా పండగల వేళ

ఆర్టీసీ బాదుడు

ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్





హైదరాబాద్, అక్టోబర్ 18:

బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న ఏడు వేల ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్

మందగమనం

తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

- హైదరాబాద్‌లో మందగించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు
- గతేడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గుదల
- పడిపోయిన బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల అమ్మకాలు
- కోటి రూపాయల పైబడిన ఇళ్లకే కొనసాగుతున్న ఆదరణ
- మొత్తం లావాదేవీల విలువను నిలబెడుతున్న ప్రీమియం సెగ్మెంట్

2లో..



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల

జీతాల్లో కోత

ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 18:

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ..మిగతా 2లో



రష్యాపైకి ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

మంటల్లో ఇంధన టెర్మినల్, ఒకేసారి 1000 కి పైగా డ్రోన్లతో దాడి



జిల్లాలో రైస్ మిల్లర్ల మాయజాలం...

కాసులు కురిసిస్తున్న సీఎంఆర్ దందా..

రూపాయి పెట్టుబడి లేకుండా కోట్ల విలువైన బియ్యం పక్కదారి

అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లర్లకే మళ్లీ ధాన్యం కేటాయింపులు

పలు రైస్ మిల్లులు షార్టేజ్ ధాన్యం రావడంతో అధికారులకు సెటిల్ మెంట్ చేసినట్లు సమాచారం

జోగుళాంబ గద్వాల జిల్లా :



రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వడ్లను మిల్లుల ద్వారా బియ్యంగా మార్చి వాటిని పేదలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన సీఎంఆర్ ప్రక్రియను కొందరు రైస్ మిల్లర్లు అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నారు. రూపాయి కూడా పెట్టుబడి లేకుండా మిల్లులకు వచ్చిన వడ్లతో పాటు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ కోట్లు దండుకుంటున్నారు. ఇటీవల గద్వాల జిల్లాలో పలు రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీల్లో వెల్లడైన లెక్కలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కాసులు కురిపిస్తున్న వ్యాపారం...

రూపాయి పెట్టుబడి లేకుండా ప్రభుత్వమే ధాన్యం ఇవ్వడం మర ఆడించిన తర్వాత 67 శాతం బియ్యం మాత్రమే తిరిగి ఇవ్వాలని నిబంధనలు ఉండడంతో మిల్లు యజమానులకు బియ్యం వ్యాపారం కాసులు కురిపిస్తుంది. గద్వాల జిల్లాలో 60 వరకు మాత్రమే మిల్లులు ఉండేవి. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు మర ఆడించి ఇవ్వడానికి ఉచితంగా ఇస్తుండడంతో ఎలాంటి పెట్టుబడి లేని వ్యాపారంగా మారింది. దీంతో కొత్త మిల్లులు పుట్టగొడుగులుగా పుట్టుకొచ్చాయి. పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యం ఇస్తుండడంతో మిల్లుల యజమానులు సిఎంఆర్ ధాన్యాన్ని తమ వ్యాపార పెట్టుబడులుగా మార్చుకుంటున్నారు. ఈ సీజన్లో ఇచ్చిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ సదరు ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారులు.. మిల్లర్ల 'సిండికేట్'

ఈ దందా ఏళ్ల తరబడి అడ్డూఅదుపు లేకుండా సాగడానికి పౌరసరఫరాల శాఖలోని కొందరు ఉన్నతాధికారులు, కిందిస్థాయి ఇన్ స్పెక్టర్లు, డిపో మేనేజర్ల తోడ్పాటే కారణమనే ఆరోపణలున్నాయి. ప్రతి నెలా మిల్లుల్లో ధాన్యం నిల్వలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటుపడి ఖాళీ గోదాముల్లో కూడా నిల్వ ఉన్నట్లు కాగితాలపై రికార్డు రాస్తున్నారు. ఒక్కో లారీ రీ-సైక్లింగ్ బియ్యాన్ని ఎఫ్ సి ఐ ,సివిల్ సప్లైస్ గోదాముల్లో అన్-లోడ్ చేయించడానికి .10,000 నుంచి .15,000 లంచాల చేతులు మారుతున్నట్లు సమాచారం. సిండికేట్ పుణ్యమా అని ప్రజాధనం లూటీ చేస్తూ పేదలకు తిరిగి రేషన్ బియ్యమే దక్కుతున్నాయనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఆ రైస్ మిల్లులో 50వేల బస్తాలు మాయం

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పలు రైస్ మిల్లులో సీఎంఆర్ కోసం ఇచ్చిన వడ్లు మాయమయ్యాయి. ఆఫీసర్లు తనిఖీలు చేయగా ఈ విషయం బయటపడింది. వీటి విలువ దాదాపు రూ.6 కోట్లు ఉంటుందని ఆఫీసర్లు అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గద్వాల పట్టణ పరిధిలోని బీరెల్లి రోడ్డులో ఒక రైస్ మిల్లు నుంచి అధికారులు కేటాయించిన వడ్లను పక్కదారి పట్టించారనే సమాచారంతో ఈ నెల 17న మిల్లుపై హైదరాబాద్ చెందిన టాస్క్ ఫోర్స్ ఆఫీసర్లు ,ఎఫ్ సీఐ అధికారులు తనిఖీలు చేయగా సుమారు 50వేల బస్తాలు పక్కదారి పట్టినట్లు సమాచారం. వీటి విలువ సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.

ఇప్పటికే పలు మిల్లుల్లో తేడా

జిల్లాలోని సుమారు 10 రైస్ మిల్లుల్లో ఇప్పటికే ధాన్యంలో భారీగా తేడాలు ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. గద్వాల పట్టణ శివారులోని రెండు రైస్ మిల్లులో కోట్ల రూపాయల విలువైన ధాన్యం లోటును గుర్తించారు.

బస్తాకు 25 పైసల చొప్పున వసూలు?

జిల్లాలోని 60కి పైగా మిల్లుల్లో మిగిలి ఉన్న ధాన్యం నిల్వలకు సంబంధించి ఒక్కో బస్తాకు 25 పైసల చొప్పున వసూలు చేసేందుకు బీరోల్లి రోడ్డులోని ఓ మిల్లు యజమాని మధ్యవర్తిత్వం నడిపినట్లు తెలుస్తుంది . ఈ వ్యవహారంలో పలువురు మిల్లుల యజమానులు కలిసి చక్రం తిప్పినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అధికారుల తనిఖీల సమయంలో సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ఈ వ్యవహారం సాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నుండి వచ్చిన ఇద్దరు ఎఫ్ సీఐ అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చేందుకు తెలుస్తుంది. మధ్యవర్తిత్వం నడుపుతున్నట్లు సమాచారం.

లాడ్జిలో మంతనాలు?

తనిఖీల సందర్భంగా సదరు మిల్లుపై చర్యలు తీసుకోకుండా జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఒక లాడ్జిలో అధికారులతో మంతనాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో భారీ మొత్తంలో నగదు చేతులు మారినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్, ఎఫ్సీఐ, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మిల్లుల తనిఖీలకు వచ్చిన ప్రతిసారీ ఓ షాడో మిల్లు యజమాని మధ్యవర్తిగా వ్యవహరిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

సమగ్ర విచారణ జరిపించాలి

"ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా కొందరు అధికారులు సిండికేట్గా మారి ఈ దందాను నడుపుతున్నారు. పౌరసరఫరాల శాఖను వెంటనే ప్రక్షాళన చేసి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ లేదా 'సిట్' విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లులను సీజ్ చేసి వారి ఆస్తులను చేయాలి." అని మేధావులు కోరుతున్నారు.



కూకట్‌పల్లిలో ఘనంగా
సద్దుల బతుకమ్మ వేడుకలు

మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ నివాసంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు

కూకట్ పల్లి, అక్టోబర్ 18 :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ మాజీ జూపల్లి సత్యనారాయణ నివాసంలో ఆయన కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని నింపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తూ పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్
మందగమనం

హైదరాబాద్, అక్టోబర్ 18 :

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు సెప్టెంబర్ నెలలో కాస్త బ్రేకులు పడ్డాయి. గృహాలకు సంబంధించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదైంది. అయితే, కోటి రూపాయలకు పైబడిన ప్రీమియం ఇళ్ల సెగ్మెంట్ మాత్రం స్థిరమైన డిమాండ్‌తో మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ డేటాను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో హైదరాబాద్ (హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కలిపి) పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. అదేవిధంగా, లావాదేవీల విలువ కూడా 7 శాతం తగ్గి, రూ.4,804 కోట్ల నుంచి రూ.4,487 కోట్లకు చేరింది. ఆగస్టు 2026 నెలతో పోల్చినా కూడా రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత కనిపించింది. ఈ తగ్గుదల ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. 50 లక్షల లోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి. అయితే, దీనికి పూర్తి భిన్నంగా ప్రీమియం సెగ్మెంట్ నిలకడగా రాణించింది. కోటి రూపాయలకు పైబడిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12 శాతం తగ్గినా, వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో ఈ సెగ్మెంట్ వాటా గతేడాది 54 శాతం ఉండగా, ఈసారి అది 56 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్‌లో అధిక విలువ గల గృహాలకు డిమాండ్ బలంగా ఉందని సూచిస్తోంది.

మొత్తం మీద నిలకడగానే...

సెప్టెంబర్ నెలలో అమ్మకాలు మందగించినప్పటికీ, 2026 క్యాలెండర్ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల (జనవరి-సెప్టెంబర్) గణాంకాలను పరిశీలిస్తే మార్కెట్ నిలకడగానే ఉంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం 55,715 యూనిట్లు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం గైడెన్స్ విలువల సవరణ తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా పెరగడం వల్ల మొత్తం లావాదేవీల విలువ స్థిరంగా ఉంది. ఇది ప్రీమియం గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది" అని వివరించారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోత

మొదటి పేజీ తరువాయి...

అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

మధ్యప్రదేశ్‌లో శరన్నవరాత్రి వేళ ఘోర ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అదుపుతప్పిన లారీ పోలీస్ బారికేడ్లు, స్టాపర్లను ఛేదించుకుని ఆలయం వైపు దూసుకొచ్చింది. ఆలయ ప్రధాన ద్వారం, గోడను ఢీకొట్టింది. అప్పటికీ ఆగకుండా అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భక్తులు ట్రక్కు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులకూ తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. వారిలో ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని గ్వాలియర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ధర్మవీర్ సింగ్ చెప్పారు. నవరాత్రుల సందర్భంగా ఆ మార్గంలో బారికేడ్లు, పోలీసు చెక్‌పోస్టు, స్టాపర్లు ఉన్నప్పటికీ ట్రక్కు ఎలా లోపలికి వచ్చిందనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రష్యాపైకి ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:

రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్ మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రంప్ 'ఇంధన కాల్పుల విరమణ' ప్రకటించిన వారం రోజుల్లోనే తమ ఇంధన, చమురు, గ్యాస్ సదుపాయాలపై రష్యా 76 సార్లు దాడులకు తెగబడిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. విద్యుత్ బ్లాక్‌అవుట్ సృష్టించేందుకు మాస్కో యత్నిస్తోందని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎటువంటి సానుకూల చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించాలన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఘనంగా శ్రీ దుర్గాష్టమి వేడుకలు





బండ్లగూడ, అక్టోబర్ 18:

కిస్మత్ పూర్ విద్యుత్ సబ్ స్టేషన్ లో శ్రీ దుర్గాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అధికారులు, ఉద్యోగులు నిర్వహించారు. సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ దుర్గాష్టమి వేడుకల్లో రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ డివిజన్ ఏ డి ఈ సత్యనారాయణ, విద్యుత్ ఉద్యోగ 1104 సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి, యూనియన్ ప్రతినిధులు నరేందర్, విజయ్, ఉద్యోగులు సత్యనారాయణ, ఇబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్, తేజ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్, అక్టోబర్ 18:

ప్రజా భవన్ లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మి, పిసిసి ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డి, మహిళా నాయకురాలు రమ్యా రావు, ఇందిరా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి...

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి:

- కొత్తగూడెం -పాల్వంచ పద్మశాలి సంఘం డిమాండ్.

అక్టోబర్ 18 /భద్రాద్రి కొత్తగూడెం/ : పాల్వంచ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ ఆత్మహత్య ఘటనపై పద్మశాలి సంఘం తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణను వేగవంతం చేయాలని, అనంతుల లక్ష్మీనారాయణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విధినిర్వహణలో ఆయనపై వేధింపులు జరిగాయా? మానసిక ఒత్తిడికి గురిచేసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతుల లక్ష్మీనారాయణ హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి ఎంతో నిబద్ధతతో సేవలందించిన ఉత్తమ ఉద్యోగి అని పద్మశాలి సంఘం నాయకులు గుర్తుచేశారు. కరోనా మహమ్మారి సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లో, యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉన్న సమయంలోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ యాజమాన్యం కూడా అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతుల లక్ష్మీనారాయణ పై వేధింపులు జరిగినట్లు విచారణలో తేలితే, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో త్వరలో జిల్లా ఎస్పీని కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పద్మశాలి సంఘం నాయకులు పీసీసీ కార్యదర్శి మోతుకూరు ధర్మారావు, చిప్పా శ్రీనివాస్, కనుకుంట్ల కుమార్, వేముల మనోహర్‌రావు మాటేటి అశోక్ , కొత్తగూడెం పద్మశాలి







సంఘం అధ్యక్షులు వేముల ప్రసాద్, ఉపాధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్ సహాయ కార్యదర్శి మాదాసు మాధవరావు, కోశాధికారి కేదాసి నవీన్, కార్యవర్గ సభ్యులు వేముల మధుకర్, సామంతుల నరేష్, పాల్వంచ పద్మశాలి సంఘం, ఉద్యోగ సంఘాల నాయకులు అధ్యక్షుడు ఆడేపు రమాకాంత్, ఎర్రగుంట సాంబశివరావు, గుగ్గిళ్ల రామ్మూర్తి, ఆర్ఎంపీ డాక్టర్ మారయ్య, గుండు రవి, దోమల కిషోర్, మనుపురి ప్రభాకర్, దోమల ప్రవీణ్, పిండిపోలు కన్నయ్య, పెగుడ శంకర్, వెంకటేశ్వర్లు, మేకల కిరణ్, రామ్మోహన్, రాందాస్, బొమ్మ రామకిషోర్, వెలదండి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



56వ డివిజన్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ముఖ్య అతిథులకు పాల్గొన్న మాజీ కౌన్సిలర్ బాలిసెట్టి సత్యభామ--సుందర్ రాజ్

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 18(భద్రాద్రి న్యూస్): కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్‌లో కార్పొరేటర్ బాలిసెట్టి సత్యభామ--సుందర్ రాజ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, బతుకమ్మ చుట్టూ కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ వాతావరణంతో 56వ డివిజన్ సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఇలాంటి పండుగలను ఘనంగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్రంలో బిజెపి గెలుపు తథ్యం

- తెలంగాణ రాష్ట్రంలో 2వ స్థానం దక్కించుకున్న సేవా సంకల్ప్ అభియాన్ అంగన్ మిలాన్ ఫోగ్రాం.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి కి ఘన సన్మానం.

- బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు సక్సెస్



కొత్తగూడెం అర్బన్ , అక్టోబర్ 18(భద్రాద్రిన్యూస్):- నరేంద్ర మోడీ ప్రజాప్రతినిధిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, జాతీయ, రాష్ట్ర బిజెపి పిలుపుమేరకు "సేవా సంకల్ప్ అభియాన్" లో భాగంగా చేపట్టిన "అంగన్ మీలాన్" కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ స్థానంలో నిలవడంపై జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యాలయానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, చత్తీస్గడ్ రాష్ట్ర, మహాసముంద్ ఎంపీ శ్రీమతి రూప్ కుమారి చౌదరి చేతుల మీదుగా ఘన సన్మానం అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకుడు, గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా 13సంవత్సరాలు, ప్రధానమంత్రిగా 12సంవత్సరాలు సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంతోషకరమైన సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ అధిష్టానం "సేవా సంకల్ప్ అభియాన్" పేరిట 9 రకాల సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బిజెపి మహిళా మోర్చాకు కేటాయించిన "అంగన్ మీలాన్" కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళా మోర్చా కార్యకర్తలు, నాయకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రస్థాయిలోనే ద్వితీయ (2వ) స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు పేర్కొన్నారు.

ఈ అద్భుత ప్రతిభకు గుర్తింపుగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మహాసముంద్ లోక్‌సభ సభ్యురాలు, బిజెపి జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి రూప్ కుమారి చౌదరి చేతుల మీదుగా టాప్-5లో నిలిచిన జిల్లా అధ్యక్షురాళ్లతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలునైనా నన్ను సన్మానించిన జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలికి అలాగే రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి గారి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

"గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు అందించిన సుపరిపాలన, ప్రజాసేవ మనందరికీ స్ఫూర్తిదాయకం. బిజెపి మహిళా మోర్చా జాతీయ, రాష్ట్ర నాయకత్వాల పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని, చిన్నారులను, గర్భిణులను కలిసి మోడీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాం. జిల్లాలోని ప్రతి గ్రామంలో మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు శ్రమించి 'అంగన్ మీలాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మన జిల్లాను రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిపినందుకు జిల్లాలోని మహిళా మోర్చా నాయకురాళ్లకు, కార్యకర్తలకు, బిజెపి జిల్లా నాయకత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్ర స్థాయిలో జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎంపీ శ్రీమతి రూప్ కుమారి చౌదరి గారి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం నా ఒక్కదానికే కాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి మహిళా మోర్చా కార్యకర్తలందరికీ లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను అని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా మోడీ గారి సంక్షేమ ఫలాలను ఇంటింటికీ తీసుకెళ్లడానికి మహిళా మోర్చా నిరంతరం కృషి చేస్తుంది అని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 18 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం నగరంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ బతుకమ్మను పేరుస్తూ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైన భాగమని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు, ఆడపడుచులు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని, సౌభాగ్యాన్ని, ఆయురారోగ్యాలను నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మన పండుగల విశిష్టతను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు, ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- జాతీయ ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు మధుకర్ పిలుపు

- ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో వేడుకలు, కేక్ కటింగ్

భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్ 18(భద్రాద్రిన్యూస్): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దమైన బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ ఘనంగా నిర్వహించుకోవాలని జాతీయ ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్ పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు తెలిపారు. ఎక్కడ ఉన్నా సొంత ప్రాంత సంస్కృతి, ఆచారాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లెటూళ్లలో గడిపిన చిన్ననాటి పండుగ జ్ఞాపకాలను ఆయన ఉద్యోగులతో పంచుకున్నారు. తీరొక్క పూల సేకరణ, కొత్త బట్టల సంబరం, ఆడపడుచుల ఆటపాటలు, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం, పిండి వంటల ఘుమఘుమలు మరియు ఆత్మీయతను పంచే 'అలయ్-బలయ్' ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం ఉద్యోగుల సమక్షంలో బతుకమ్మ పండుగ ప్రత్యేక కేక్‌ను కట్ చేసి, అందరికీ స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సారథి నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- 600 బతుకమ్మలతో మహిళల సందడి..

- విజేతలకు బహుమతుల ప్రదానం



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 18 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ సారథి నగర్‌లో బతుకమ్మ సంబరాలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ 48వ డివిజన్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సుమారు 600 బతుకమ్మలతో మహిళలు పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న భక్తురాళ్లకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతులు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.కె. ఖాదర్ బాబా, కాంగ్రెస్ జిల్లా నాయకులు కమ్మర్తపు మురళి హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర నాయకులు బాణాల లక్ష్మణ్, బోజట్ల సత్యనారాయణ, ప్రసన్న కుమార్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

వైద్య సాంకేతిక విద్యలను అభ్యసిస్తున్న పేద విద్యార్థిని విద్యార్థులకు కొండబోలు సురేష్ ఆర్థిక సహాయం

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 18 (భద్రాద్రిన్యూస్):
వైరా మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వైద్య విద్య, సాంకేతిక విద్యలు అభ్యసిస్తున్న 17 మంది విద్యార్థిని విద్యార్థులకు సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు కొండబో లు సురేష్ వారి సోదరి కొండబోలు లలిత 2 లక్షల పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైరా గుట్ట బడి ప్రాథమిక పాఠశాల యందు వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా ఏసిపి సారంగపాణి వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందజేసినారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏసీబీ సారంగపాణి మాట్లాడుతూ విద్య బోలు ధనం పృద్వి లో లేదని విద్య ద్వారా వినయం, ఉన్నత స్థితి లభిస్తుందని వైరా ప్రాంతంలోని వైద్య విద్యను అభ్యసిస్తున్న ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులకు 15 వేల రూపాయలు చొప్పున సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న 9 మంది విద్యార్థిని విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2 లక్షల పదివేల రూపాయలను అందజేస్తూ ఆయన మాట్లాడినారు. వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో గొప్పదని వైద్యులకు ఓపిక అవసరమని, వ్యసనాలకు దూరంగా ఉంటూ వైద్య విద్య ను కష్టంతో ఇష్టంగా అభ్యసిస్తూ వైద్యునిగా మంచి పేరు తెచ్చుకోవాలని వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది అని ఈ ఖర్చులకు గాను కొండబోలు సురేషు మరియు లలిత గార్లు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని సమాజానికి మంచి పరిణామం అని ఆమె కొనియాడినారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీమతి ముళ్ళపాటి విజయలక్ష్మి, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వార్డు కౌన్సిలర్ ఫణిత సైదులు, ముళ్ళపాటి సీతారాములు, ఉంద్రు శ్యాంబాబు, సోమవరం గ్రామస్తులు బెజవాడ వీరభద్రశీ స్థానిక పాఠశాల హెచ్.ఎం శ్రీనివాసచారి, ఉపాధ్యాయసంఘాల బాధ్యులు గూడపాటి సూర్యం, పెనుగొండ ఉపేంద్రరావు, పాలపర్తి భాస్కర్, దొడ్డ వరప్రసాద్, వైరా సబ్ ఇన్స్పెక్టర్ పుష్పాల రామారావు, తోటకూర రఘు, పొదిల హరినాథ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
సోమవారం
19 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

దుర్గమ్మ తల్లి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

- అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు







ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 18 (భద్రాద్రిన్యూస్): 19వ డివిజన్ పరిధిలోని దుర్గమ్మ తల్లి మండపాల వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ చామకూరి వెంకటనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దుర్గమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమ కమిటీ సభ్యులతో మాట్లాడి కార్యక్రమ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు భక్తిభావాన్ని, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించి దుర్గమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని చామకూరి వెంకటనారాయణ కోరారు. భక్తుల భాగస్వామ్యంతో అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బిటిపిఎస్‌లో కార్మిక సంఘం నేత జాన్ రెడ్డి దాతృత్వం..

- మహిళా కార్మికులకు చీరల పంపిణీ



పాల్వంచ, అక్టోబర్ 18

(భద్రాద్రి న్యూస్): దసరా పండుగను పురస్కరించుకుని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) కార్మికుల్లో సంబరాలు మిన్నంటాయి. ఇందులో భాగంగా బిటిపిఎస్‌లోని సివిల్ సర్కిల్-2 కార్యాలయంలో ఆదివారం ఘనంగా దుర్గా అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించారు. ?ఈ పవిత్ర సందర్భం నడుమ కార్మిక సంఘం-1535 రీజనల్ వైస్ ప్రెసిడెంట్ కొత్త జాన్ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న 25 మంది మహిళా కాంట్రాక్టు కార్మికులకు స్వయంగా చీరలు, జాకెట్లను ఉచితంగా పంపిణీ చేసి వారిలో దసరా పండుగ సంతోషాన్ని నింపారు. ?ఈ వేడుకకు సివిల్ సర్కిల్-1 ఎస్ఈ **(Superintending Engineer)** రాంప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారి చేతుల మీదుగా మహిళా కార్మికులకు కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాంప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి పాటుపడటమే కాకుండా, పండుగ వేళ మహిళా కార్మికులకు అండగా నిలుస్తూ జాన్ రెడ్డి ప్రదర్శించిన పెద్ద మనసును, దాతృత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. తోటి కార్మికులకు ఇలాంటి సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (జుజు) దాసుతో పాటు పలువురు కర్మాగార ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ముదిగొండ ఎస్సై టి అశోక్

ముదిగొండ, అక్టోబర్ 18





(భద్రాద్రి న్యూస్):మండల పరిధిలోని బాణాపురం గ్రామంలో పాండవసేన యువకుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముదిగొండ ఎస్సై టి అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని అన్నదాన కార్యక్రమానికి ప్రతి ఒక్క మహిళలు చిన్నలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ... అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పది అని కొనియాడారు ఇలాంటి మంచి కార్యక్రమాలు ముందు ముందు మరిన్ని చేయాలని యూత్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, ముదిరాజ్ సంఘ పెద్దలు, గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు

మీడియా సమాజానికి దిక్సూచి లాంటిది....

- కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి ..

- విలేకరులు సమాజానికి నాలుగో స్తంభం..



పాల్వంచ, అక్టోబర్ 18(భద్రాద్రి న్యూస్): మీడియా సమాజానికి దిక్సూచి లాంటిదని, ప్రభుత్వాలకు ప్రజలకు వారది లాంటిదని కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి అన్నారు. ఆదివారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన వారు జర్నలిస్టుల కోసం పదివేల రూపాయల విలువైన జర్నలిజం పుస్తకాలను బహుకరించారు. అదేవిధంగా తమవంతుగా ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం రూ.10016 లు నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన పాల్వంచ పరిసర ప్రాంతాలను విద్య వైద్య రంగాలలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రత్యుపకారం ఆశించకుండా సమాజ సేవ చేస్తున్న కొల్లి ఫౌండేషన్ కు తమవంతుగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, ఫౌండేషన్ ద్వారా చేసే కార్యక్రమాలలో భాగస్వాములము అవుతామ ని తెలిపారు.కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్బురం కార్యదర్శి లెనిన్, సీనియర్ పాత్రికేయులు జైనుల, సుభాని కృష్ణమూర్తి, నరసింహారావు, నాగేశ్వరరావు, సందీప్, కిషోర్, వెంకటనారాయణ, జీవి రత్నం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు జగదీష్, ముత్యాల శేఖర్ అక్బర్ జర్నలిస్టులు, కొల్లి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణిలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

- సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ ప్రత్యేక చొరవతో ఘనంగా వేడుకలు..

- పెద్ద చెరువు వరకు కన్నుల పండువగా శోభాయాత్ర





కారేపల్లి, అక్టోబర్ 19 (భద్రాద్రి న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు సింగరేణి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ ప్రత్యేక చొరవతో చేపట్టిన ఏర్పాట్లతో పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సింగరేణి గ్రామం పూల పండుగ శోభను సంతరించుకుంది. గ్రామంలోని మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, పెద్దమ్మతల్లి ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను తీసుకుని పెద్ద చెరువు వైపు శోభాయాత్రగా బయలుదేరారు. డీజే పాటలు, బతుకమ్మ గీతాల నడుమ మహిళలు ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

సర్పంచ్ టోనీ ప్రత్యేక చొరవ

బతుకమ్మ వేడుకలకు హాజరైన మహిళలు, గ్రామస్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కారేపల్లి నుంచి పెద్ద చెరువు వరకు వెళ్లే మార్గంలో వెలుతురు సదుపాయాలు, చెరువు ప్రాంగణంలో అవసరమైన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. మహిళలు ప్రశాంతంగా, సంతోషంగా వేడుకల్లో పాల్గొనేలా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

పోలీసుల పటిష్ఠ బందోబస్తు

బతుకమ్మ వేడుకలకు మహిళలు, ప్రజలు భారీగా తరలిరావడంతో కారేపల్లి పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్ద చెరువు పరిసరాలతోపాటు ప్రధాన మార్గాల్లో బందోబస్తు నిర్వహించారు. గ్రామపంచాయతీ, పోలీసు శాఖ సమన్వయంతో బతుకమ్మ సంబరాలు ప్రశాంతంగా ముగిశాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సింగరేణి గ్రామంలో ఇంతటి వైభవంగా నిర్వహించుకోవడం గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపింది. సంప్రదాయాలను కాపాడుతూ, గ్రామ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతల లక్ష్మీనారాయణ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి

- కుటుంబానికి న్యాయం చేయాలి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి: పద్మశాలి సంఘం డిమాండ్.





పాల్వంచ, అక్టోబర్18 (భద్రాద్రి న్యూస్): హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ క్రీస్తుశేషులు అనంతల లక్ష్మీనారాయణ ఆత్మహత్య ఘటనపై పద్మశాలి సంఘం తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణను వేగవంతం చేయాలని, అనంతల లక్ష్మీనారాయణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విధుల నిర్వహణలో ఆయనపై వేధింపులు జరిగాయా? మానసిక ఒత్తిడికి గురిచేసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు.అనంత లక్ష్మీనారాయణ హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి ఎంతో నిబద్ధతతో సేవలందించిన ఉత్తమ ఉద్యోగి అని పద్మశాలి సంఘం నాయకులు గుర్తుచేశారు. కరోనా మహమ్మారి సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లో, యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉన్న సమయంలోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ యాజమాన్యం కూడా అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతల లక్ష్మీనారాయణపై వేధింపులు జరిగినట్లు విచారణలో తేలితే, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు అనంతల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసి, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ పద్మశాలి సంఘం, ఉద్యోగ సంఘాల నాయకులు అధ్యక్షుడు ఆడేపు రమాకాంత్, ఎర్రగుంట సాంబశివరావు, గుగ్గిళ్ల రామ్మూర్తి, ఆర్ఎంపీ డాక్టర్ మారయ్య, గుండు రవి, దోమల కిషోర్, మనుపురి ప్రభాకర్, దోమల ప్రవీణ్, పిండిపోలు కన్నయ్య, పెగుడ శంకర్, వెంకటేశ్వర్లు, మేకల కిరణ్, రామ్మోహన్, రాందాస్, వెలదండి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటా

- ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క

- వైరాలో ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని నిర్మించాలి - ఆర్య వైశ్యులు





వైరా, అక్టోబర్ 18, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం వైరా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు, ఆర్థిక శాఖ మాత్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్కను వైరా ఆర్యవైశ్య ప్రముఖులు రంగా జనార్ధన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇన్చార్జి గ్రంధి ప్రవీణ్, వారి బృందం శ్రీ మల్లు భట్టి విక్రమార్క ను వైరాలో కలిసి ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్య కా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని నిర్మించాలని కోరుతూ ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకుని రావటమైనది, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆర్యవైశ్యుల యొక్క న్యాయమైన కోర్కెలను, అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తానని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇంచార్జ్ ఆత్మకూరి శేషగిరిరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మిట్టపల్లి శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, మైలవరపు శ్రీనివాసరావు, తాటికొండ రాము, మిట్టపల్లి భాస్కర్, అనుమోలు శ్రీనివాసరావు, మెరిసెట్టి జనార్ధన్, చేగోని కొండ, తదితరులు పాల్గొని తమ సమస్యలను వివరించారు

వైద్య సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కొండబోలు సురేష్, లలిత లు ఆర్థిక చేయూత

- ముఖ్య అతిథులుగా వైరా ఏసీపీ సారంగపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ,



వైరా, అక్టోబర్ 18, (భద్రాద్రి న్యూస్) :
వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సోమవారం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రావస భారతీయులు కొండబోలు సురేష్, వారి సోదరి కొండబోలు లలిత రెండు లక్షల పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వైరా గుట్ట బడి పాఠశాలలో వైరా మండల విద్యాధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా ఏసీపీ సారంగపాణి, వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైరా ఎస్సై పుష్పాల రామారావు చేతుల మీదుగా 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 10,000 వేల రూపాయలు చొప్పున మొత్తం 2లక్షల పదివేల రూపాయలను విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో చాలా నిగూఢమైన శక్తి దాగి ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమలోని శక్తిని తెలుసుకోవాలని, అది విద్య ద్వారానే సాధ్యమవుతుందని, విద్య ద్వారా వినయం, ఉన్నత స్థితి లభిస్తుందని, వైద్య విద్య, సాంకేతిక విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉన్నత స్థితికి వెళ్లాలని, కుంటున్నానని అన్నారు. వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ వైద్య విద్య గొప్పదని, వైద్యానికి ఓపిక అవసరం అని పెడదోరనలకు దూరంగా ఉంటూ, వైద్య విద్య బాగా చదువుకొని వైద్యునిగా మంచి పేరు సంపాదించాలని, వైద్య విద్య ఖర్చుతో కూడుకున్నదని, ఈ ఖర్చులకు గాను కొండబోలు సురేష్, లలిత లు ఆర్థిక సాయం విద్యార్థులకు అందజేయడం గొప్ప విషయం అని,అన్ని దానాలోకెల్లా విద్యాదానం చాలా గొప్పదని విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రమలు, ముల్లపాటి విజయలక్ష్మి, జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా మున్సిపల్ కౌన్సిలర్ పనితీ సైదులు, ముళ్ళపాటి సీతారాములు, శ్యాంబాబు, సోమవారం గ్రామానికి చెందిన బెజవాడ మరబోరావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి, ఉపాధ్యాయ సంఘాల నేతలు సూర్యం, భాస్కరరావు, ఉపేంద్ర రావు, వైరా ఎస్సై పుష్పాల రామారావు, తోటకూర రఘు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా సద్దుల బతుకమ్మ..

- పూల సంబరాలతో మారుమోగిన గ్రామాలు







గుండాల,అక్టోబర్ 18 భద్రాద్రి న్యూస్ : మండలంలోని పలు గ్రామాలలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళల ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామాలన్నీ పూల పరిమళాలతో కళకళలాడగా, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి, కట్ల వంటి సీజనల్ పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజించడం ఈ పండుగ విశిష్టత. ప్రతి ఇంటి మహిళలు తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు.బొడ్డెమ్మ పండుగతో ప్రారంభమై ఎంగిలిపువ్వు బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, చివరగా సద్దుల బతుకమ్మతో ముగిసే తొమ్మిది రోజుల వేడుకలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా పులిహోర, దద్దోజనం, నువ్వుల సద్దు, కొబ్బరి సద్దు, బెల్లం సద్దు తదితర నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం వేళ మహిళలు బతుకమ్మలను ఘాట్‌కు తీసుకువచ్చి వలయాకారంగా నిలబడి బతుకమ్మ పాటలు ఆలపిస్తూ సంప్రదాయాన్ని చాటిచెప్పారు. పాటల ద్వారా ప్రేమ, ఆప్యాయత, బంధుత్వం, స్నేహం, కుటుంబ విలువలను గుర్తు చేసుకుంటూ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేలా వేడుకలను నిర్వహించారు. అనంతరం “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో” అంటూ హర్షధ్వానాల నడుమ సమీపంలోని చెరువు, బావుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం అధికారికంగా బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తుండటంతో ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యం లభించింది. అయితే బతుకమ్మకు శతాబ్దాల చరిత్ర ఉందని, తెలంగాణ ప్రజలు తమ ఇంటి ఆడపడుచుల పండుగగా, ఇంటి దేవత ఆరాధనగా ఈ పండుగను తరతరాలుగా జరుపుకుంటూ వస్తున్నారని పెద్దలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువతులు, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. పలుచోట్ల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసి బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ ల్యాగ్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, చిన్నారులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగకు బలైన రైతు రమణారెడ్డి!

- గతంలో విద్యుత్ షాక్‌తో కుమారుడి మృతి.. ఇప్పుడు తండ్రి మృత్యువాత

- ఒకే కుటుంబంలో ఇద్దరిని బలిగొన్న విద్యుత్ ప్రమాదం.. జీపి పల్లిలో విషాదఛాయలు



చర్ల,18. అక్టోబర్ భద్రాద్రి న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నికత్తిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జీపి పల్లి గ్రామానికి చెందిన పుచ్చ రమణారెడ్డి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆదివారం ఉదయం తన పంట పొలానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే రమణారెడ్డిని చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యుడు సాయి వర్ధన్ అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒకే కుటుంబంలో తండ్రి, కుమారుడు విద్యుత్ ప్రమాదాలకు బలి కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. గతంలో రమణారెడ్డి కుమారుడు కూడా విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, ఇప్పుడు తండ్రి సైతం అదే తరహా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో జీపి పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు, రేపు ఉభయ జిల్లాల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన

పాలేరు అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో వరుసగా రెండు రోజులు పర్యటిస్తారు. సోమవారం సాయంత్రం 4:30 గంటలకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో.. కూసుమంచి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. ఆ తర్వాత సాయంత్రం 5:45 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని.. 22వ వార్డు టీవీన్జీహోస్ కాలనీలో గిరిజన సంక్షేమ శాఖ బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మంగళవారం ఉదయం 9:30 గంటల నుంచి ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం దేవస్థానంలో, ఆ తర్వాత తక్కెళ్ళపాడు గ్రామంలోని శ్రీ లలితా రాజరాజేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని జేకే కాలనీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం.. మినీ స్టేడియాన్ని, గోవింద్ సెంటర్ లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు తిలక్ నగర్ లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరవుతారు. ఇల్లెందు మండలం మేడికుంట వద్ద హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు ఫారెస్ట్ గ్రౌండ్ లో నిర్వహించే దసరా ఉత్సవాలకు హాజరవుతారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలి.. విద్యుత్ పొదుపు పాటించాలి!

- సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ పిలుపు



కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామపంచాయతీల పరిధిలో నీరు, విద్యుత్ పొదుపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావించి వృథాను అరికట్టేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ట్యాంకులు నిండిన వెంటనే పంపులను నిలిపివేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం లేని సమయాల్లో వీధి దీపాలను ఆపివేస్తూ విద్యుత్ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన అవసరం

వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని రంజిత్ కుమార్ సూచించారు. వ్యవసాయ శాఖ సహకారంతో తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామపంచాయతీలో నీరు, విద్యుత్ పొదుపు చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. నేటి పొదుపే భవిష్యత్తుకు భరోసా అని, ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రంజిత్ కుమార్ కోరారు.

కనకదుర్గమ్మ సేవలో లావుడ్యా తండా యువత..

- అన్నదానంతో సేవాభావం!

- గుగులోత్ నారాయణ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ.. బతుకమ్మ ఆటపాటలతో తండాలో ఆధ్యాత్మిక సందడి





కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్‌రాములు): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని లావుడ్యా తండాలో కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిశాయి. లావుడ్యా తండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుగులోత్ నారాయణ నేతృత్వంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నదానం మహాదానమనే స్ఫూర్తితో యువత చేపట్టిన ఈ సేవా కార్యక్రమం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో మహిళలు, యువతులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటలతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రకృతిని పూజిస్తూ, పూల బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ అమ్మవారి మహిమను కీర్తించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ యువత ఐక్యతను చాటడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భవాని స్వాములు, జీవన్ ఠాగూర్, యువరాజ్, కమల్, అంజలి, లక్ష్మి, నగేష్, సోను, హేమంత్, ది క్షాశ్రీ, కవిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. అన్నదానం, బతుకమ్మ సంబరాలతో లావుడ్యా తండాలో ఆధ్యాత్మిక ఆనందం వెల్లివిరిసింది.

అశ్వరావుపేట ఎస్ఐ సాయికిషోర్ రెడ్డిని శాలువాతో సత్కరించిన మీడియా బృందం



భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 18: అశ్వారావుపేట నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సాయికిషోర్ రెడ్డిని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సూర్య ఆర్సీ ఇన్‌చార్జి ఖాసీం, ప్రజా ప్రెస్ క్లబ్ చైర్మన్ షేక్ దస్తగీర్,దమ్మపేట మండల మైనారిటీ నాయకులు అల్లా ఉద్దీన్, అశ్వారావుపేట టౌన్ సూర్య రిపోర్టర్ షేక్ మునీర్ పాల్గొన్నారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సాయికిషోర్ రెడ్డికి వారు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

కోటమైసమ్మ అమ్మవారి సేవలో పర్సా పట్టాభి రామారావు దంపతులు!

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు..

గ్రామోత్సవం, మహా మృత్యుంజయ అమృత పాశుపత హోమం





కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): శ్రీ కోటమైసమ్మ అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యాలు, గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామివారి సన్నిధిలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం కోటమైసమ్మ అమ్మవారి గ్రామోత్సవం భక్తి వాతావరణంలో నిర్వహించగా, సాయంత్రం పుష్పపూజలు, అర్చనలు, దుర్గాసూక్త పారాయణాలు జరిగాయి. సాయంత్రం మహా మృత్యుంజయ అమృత పాశుపత హోమం నిర్వహించారు. రాత్రి వివిధ దేవతా హోమాలు, శాంతి హోమం, నీరాజనాలు, హారతులు, తీర్థప్రసాద వితరణతో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. నవరాత్రి ఉత్సవాలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కొత్తగూడెం జామియా మసీద్‌లో ఏఎస్‌జే ఆధ్వర్యంలో గ్యార్వీ వేడుకలు ఘనంగా జరిగాయి

- డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని జామియా మసీద్‌లో అహ్లే సున్నత్ వల్ జమాత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఆళ్ల మురళి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అహ్లే సున్నత్ వల్ జమాత్ కమిటీ గౌరవ ఛైర్మన్ ఎం.ఏ. రజాక్, ఛైర్మన్ మహమ్మద్ గౌస్ మొహినుద్దీన్, వైస్ ఛైర్మన్ షేక్ కరీం ఖాద్రీ, అధ్యక్షుడు మహమ్మద్ యూసుఫ్, ఉపాధ్యక్షుడు షేక్ యాకూబ్ ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హుస్సైన్ ఖాన్, కోశాధికారి సయ్యద్ యాకూబ్ ఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అన్వర్ పాషా, అధికార ప్రతినిధి న్యాయవాది మహమ్మద్ సాదిక్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ నయీమ్ చిష్తీ, మదీనా అక్తర్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొత్తగూడెం ముస్లిం మైనార్టీ నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు. ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమంతో గ్యార్వీ వేడుకలు కొనసాగాయి.

బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక వెలుగులు..

- సర్పంచ్ హీరాలాల్ చొరవ!

- ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు.. గ్రామస్థుల హర్షం



కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని నిమజ్జన ప్రాంగణంలో ప్రత్యేకంగా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బానోత్ హీరాలాల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఏర్పాట్లతో నిమజ్జన ప్రాంతం విద్యుత్ వెలుగులతో నిండింది. రాత్రివేళ బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలు, గ్రామస్థులకు తగిన వెలుతురు అందుబాటులో ఉండేలా ఈ చర్యలు చేపట్టారు. పండుగ వేడుకలు సురక్షితంగా, సౌకర్యవంతంగా జరిగేలా సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి పండుగల సమయంలో అవసరమైన సదుపాయాలు కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఇబ్బందులు కలగకుండా వెలుగుల ఏర్పాటు చేయడం సౌకర్యవంతంగా ఉందని పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి విచ్చేసిన మహిళా భక్తులకు చల్లటి త్రాగునీటి పంపిణీ



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెం పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మొరేడు వాగు వద్ద నిమజ్జన కార్యక్రమానికి విచ్చేసిన మహిళా భక్తులకు చల్లటి త్రాగునీటిని ఏర్పాటు చేయడం జరిగింది. గత 12 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, బతుకమ్మ పండుగ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే మహిళా భక్తులకు త్రాగునీరు అందించడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. పండుగ వేళ మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడం, పండుగల సమయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు భాస్కర్ గౌడ్, గిరి, రవి కిరణ్ తదితరులు పాల్గొని సేవలందించారు.

ఉసిరికాయలపల్లిలో కోట మైసమ్మ భక్తి గీతం ఆవిష్కరణ!

మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పాట విడుదల



కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో శ్రీ కోట మైసమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి మహిమలను చాటిచెప్పే ప్రత్యేక భక్తి గీతాన్ని గ్రామ మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర మహోత్సవాల వేళ అమ్మవారి భక్తి గీతాన్ని విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కోట మైసమ్మ తల్లి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మేకల కనకారావు రచించిన ఈ భక్తి గీతాన్ని గాయని మండల భూమిక మధుర స్వరంతో ఆలపించగా, మండల వెంకటేశ్వర్లు నిర్మించారు. అమ్మవారి వైభవాన్ని చాటిచెప్పే ఈ గీతం భక్తులను ఆకట్టుకుంటోంది. జాతరలో భాగంగా పాటను భక్తులకు వినిపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్ బోడా రవి, ఇస్లావత్ శంకర్ నాయక్, అరుణ్ భూక్య, పృథ్వీరాజ్, బోడా జస్వంత్ నాయక్, బోడా జ్యోతి, మూడు పరశురాముడు, మూడు కవితతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడిన ఆడపడుచులకు చీరల పంపిణీ..

- గుడిపూడి తిరుమల రావు

- గేట్ కారేపల్లిలో మహిళలకు పండుగ కానుకలు..

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక

కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి మండలం గేట్ కారేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు బతుకమ్మ ఆడిన ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ మహిళలకు చీరలు అందజేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గుడిపూడి తిరుమల రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. బతుకమ్మ ఆడిన మహిళలకు చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. బతుకమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కందుల సామేలు, కాంగ్రెస్ నాయకులు చెరుకూరి రామారావు, వరికొల్లు వీరభద్రం, షేక్ హాజిమియా, చెరుకూరి కృష్ణమూర్తి, నూకల మోహనరావు, కంటగాని లింగయ్య, సాయిన్నీ బసవయ్య, సపావత్ అప్పయ్య, వీరయ్య, సామినేని తిరుపతిరావు, కాకటి పృథ్వీ, కంటగాని కిషోర్, మర్రి సాయి, చందనూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిమజ్జనానికి ప్రత్యేక వెలుగులు..

- సర్పంచ్ జరుపల కిషన్

- ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా లైట్ల ఏర్పాటు..



గుండాల అక్టోబర్ 18 భద్రాద్రి న్యూస్ : బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నిమజ్జన ప్రాంగణంలో ప్రత్యేకంగా లైట్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ జరపల కిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఏర్పాట్లతో నిమజ్జన ప్రాంతం విద్యుత్ వెలుగులతో నిండింది. రాత్రివేళ బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలు, గ్రామస్థులకు తగిన వెలుతురు అందుబాటులో ఉండేలా ఈ చర్యలు చేపట్టారు. పండుగ వేడుకలు సురక్షితంగా, సౌకర్యవంతంగా జరిగేలా సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి పండుగల సమయంలో అవసరమైన సదుపాయాలు కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఇబ్బందులు కలగకుండా వెలుగుల ఏర్పాటు చేయడం సౌకర్యవంతంగా ఉందని పేర్కొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు సోయం వీరభద్రం



భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 18: దమ్మపేట మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ దారా మల్లికార్జునరావు కాంప్లెక్స్‌లో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సోయం వీరభద్రం పాల్గొని దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివశక్తి యూత్ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సోయం వీరభద్రం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాచనపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని మహిళా మణుల అందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- పాలకవర్గం మరియు సర్పంచ్ జరుపల కిషన్



గుండాల ,18 అక్టోబర్ ,భద్రాద్రి న్యూస్: కాచనపల్లి గ్రామపంచాయితీ ప్రజలకు సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు ఎంతో అంగ రంగ వైభవంగా సద్దుల బతుకమ్మ పండుగను తీరుకొక్క పువ్వులు తెచ్చి బతుకమ్మను శ్రద్ధగా పేర్చి ఐదు రకలైనటువంటి వంటకాలతో పూజ కార్యక్రమాన్ని ఈ రోజు చివరిరోజుగా నిర్వహించడం అనేది మహిళలు చేస్తూ ఉంటారు. దసరా పండగకి ముందు 9 రోజులు ఎంతో చక్కగా బతుకమ్మను పేర్చుకుంటూ గ్రౌండ్ లో ఆట పాటలతో జరుపుకుంటున్న వేడుకలు ఈ సందర్భంగా అందరం సుఖసంతోషాలతో మన అక్క చెల్లెళు ళ మహిళ మణులు ఆయురారోగ్యాలతోటి నూరేళ్ళు జీవించాలని గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు ఆ తరువాత చెరువులో వేస్తారు . ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ప్రజలకు గ్రామపెద్దలకు యువతకు మహిళా మణులఅందరికి సద్దుల బతుకమ్మ అలాగే దసరా పండుగ శుభాకాంక్షలు

కమ్మవారి కల్యాణ మండపంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



వైరా, అక్టోబర్ 18, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కమ్మవారి కల్యాణ మండపంలో ఆదివారం అంగరంగ వైభవంగా మహిళా మణులతో బతుకమ్మ సంబరాలు ఆటపాటలతో వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యున్నత సాంప్రదాయ బద్ధమైన పండుగలలో బతుకమ్మ పండుగ ఒకటని, బతుకమ్మ పండుగ అంటే బతుకు నిచ్చేది అని, ఆడపిల్లలు మెట్టినిల్లుని విడిచి పుట్టినింటికి వచ్చి తోటి కోడలు, మరదళ్లతో, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఆడుకునే గొప్ప పండుగని, పూలతో దేవుని పూజిస్తే, ఆ పూలనే దేవతగా పూజించేటువంటి గొప్ప సంస్కృతి బతుకమ్మ పండుగకు ఉందని, ఈ పండుగనాడు మహిళలు కొత్త బట్టలు ధరించి, తీరక పూలతో బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో ఆనందంగా సంతోషంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు ప్రజలు, అధిక మొత్తంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు

అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలతోనే లోకమంతా సస్యశ్యామలం





- పాల్వంచలో పలు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

- అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు

పాల్వంచ, అక్టోబర్ 19 (భద్రాద్రి న్యూస్): అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలతోనే లోకమంతా సస్యశ్యామలంగా ఉంటుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని గట్టాయిగూడెం, బొల్లోరిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యం అమ్మవారిని భక్తితో పూజిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయని, అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగల సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు సేవాభావానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, పైడిపల్లి జయలక్ష్మి, మల్లెల స్వప్న, సీరపు సుగుణ, నూకల సరిత, దంతెబోయిన నరేష్, బీఆర్ఎస్ నాయకులు మల్లెల రవిచంద్ర, కాంగ్రెస్ నాయకులు మహీపతి రాంలింగం, కొండం వెంకన్నగౌడ్, పైడిపల్లి మహేష్, వై. వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరత్నం, కత్తి శ్రీను, వీరకుమార్, కత్తి వెంకట్, సముద్రాల శ్రీను, సముద్రాల రాంబాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సేవలో లావుడ్యా తండా యువత..

- అన్నదానంతో సేవాభావం!

- గుగులోత్ నారాయణ నేతృత్వంలో లావుడ్యా తండా యూత్

అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



కారేపల్లి, అక్టోబర్ 18 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని లావుడ్యా తండాలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లావుడ్యా తండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుగులోత్ నారాయణ నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నదానం మహాదానమనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా యువత సేవాభావాన్ని చాటుకుంది. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ యూత్ అసోసియేషన్ చేపట్టిన ఈ కార్యక్రమం భవాని స్వాములు, జీవన్ ఠాగూర్, యువరాజ్, కమల్,గ్రామంలో భక్తిభావాన్ని, ఐక్యతను ప్రతిబింబించింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యానికి దోహదపడతాయని స్థానికులు పేర్కొన్నారు.

భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ ఎంతో అవసరం



శృంగేరి శంకరమఠ ఆలయ ధర్మాధికారి శ్రీ సోమయాజుల శ్రీనివాసరావు

శంషాబాద్ శృంగేరి శంకరమఠంలో అలరించిన భరతనాట్య ప్రదర్శన

సత్య నాట్య అకాడమీ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం

శంషాబాద్, అక్టోబర్ 18:

శంషాబాద్ లోని శృంగేరి శంకరమఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బండ్లగూడ జాగీరు చెందిన సత్య నాట్య అకాడమీ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను విశేషంగా



ఆకట్టుకుంది.ఈ సందర్భంగా శృంగేరి శంకరమఠ ఆలయ ధర్మాధికారి శ్రీ సోమయాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ...అక్టోబర్ 10వ తేదీన ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం గోపూజ, గురువందనం, కుంకుమ పూజ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.సత్య నాట్య అకాడమీ కళాకారులు తమ హావభావాలు, లయబద్ధమైన నృత్య విన్యాసాలు,



అభినయంతో ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భారతీయ శాస్త్రీయ నృత్య కళల గొప్పతనాన్ని చాటిచెప్పేలా సాగిన ఈ ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.కళాకారుల అద్భుతమైన ప్రదర్శనను అభినందించడంతో పాటు, భారతదేశ సాంప్రదాయ కళారూపాలను పరిరక్షించి, ప్రోత్సహించేందుకు, ముఖ్యంగా యువతరంలో శాస్త్రీయ నృత్య, సంగీతాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను ఆలయ ధర్మాధికారి శ్రీ సోమయాజుల శ్రీనివాసరావు నొక్కి చెప్పారు.శంషాబాద్ లోని శృంగేరి శంకర మఠంలో జరిగే ఉత్సవాలు, సాంప్రదాయ పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా భక్తి వాతావరణాన్ని అందిస్తూనే ఉన్నాయి.